క్లుప్తంగా

భవాని శంకర ఆలయ అభివృద్ధికి విరాళం

కొత్తకోట: కొత్తకోటలో కొలువై దినదినాభివృద్ధి చెందుతూ నమ్మి కొలిచిన వారికి కొంగు బంగారమై కోరిన వరాలనిస్తున్న అంబ భవాని ఆలయ అభివృద్ధి కోసం కొత్తకోట పట్టణానికి చెందిన ఏపూరి నిర్మలాదేవి, జగన్నాథం దంపతులు వారి కుమారులు ఏపూరి పల్లవి వినోద్ దంపతులు రూ.1,00,111లు విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ అర్చకులు మఠం ఆనందయ్య, ఆలయ నిర్వాహకులు పాగాకు రాఘవేంద్ర ప్రసాద్, భల్లె మంజునాథ్‌లకు అందజేశారు. సందర్భంగా ఆలయ అర్చకులు జగన్నాథం కుటుంబ సభ్యులను అభినందించారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శివకుమార్



వీపనగండ్ల: డిప్యూటీ తహసీల్దార్‌గా శివకుమార్ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన డీటీ కృష్ణమూర్తి వనపర్తి ఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కొత్తకోటలో డీటీగా పనిచేస్తున్న శివకుమార్ బదిలీపై వీపనగండ్లకు వచ్చారు.

విద్యార్థులను ఏఐ వైపు ప్రోత్సహించాలి

పాన్‌గల్: ప్రతి విద్యార్థిని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)వైపు ప్రోత్సహించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కాంప్లెక్స్ సమావేశం జీహెచ్‌ఎం నాగలీల అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల ప్రగతి, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సంఖ్య తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈనెల లో పదవీ విరమణ చేయనున్న ఎంఈఓను జీహెచ్‌ఎం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరు గ్రామానికి చెందిన రాగుల శేఖర్ ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స చేయించుకున్నాడు. మంత్రి జూపలి కృష్ణారావు సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.60వేలు, ఇదే గ్రామానికి చెందిన వడ్డెమాన్ బొజ్జన్న అనారోగ్యానికి గురి కావడంతో ఆయన రూ.1.50లక్షల ఎల్‌ఓసీ చెక్కును కాంగ్రెస్ మండల నాయకులు బీచుపల్లి యాదవ్ అందించారు. కార్యక్రమంలో బాలు యాదవ్, వడ్డెమాన్ బిచ్చన్న, చక్రధర్‌రెడ్డి, పెద్ద చిన్నారెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లారెడ్డి ఉన్నారు.

పెద్దదగడ యువకుల ఔదార్యం



చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ గ్రామ యువత గ్రామంలోని ప్రధాన రోడ్డుకు గుంతలు పడడం, డబుల్ రోడ్డుకు మధ్యలో అతుకులను సరిగా వేయకపోవడంతో ప్రయాణికులు, గ్రామస్తులు బైక్‌లు స్కిడ్ అయి కిందపడిపోతున్నారు. దీంతో గమనించిన గ్రామ యువత రాత్రికి రాత్రే సీసీతో మరమ్మతు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, బాలచందర్, కిరణ్, పృథ్వీరాజ్ రెడ్డి, శివ, కార్తిక్ పాల్గొన్నారు.

'మాల్స్, మార్వాడీలకు వ్యతిరేకంగా ఉద్యమం'



వనపర్తి విద్యావిభాగం: 'మాల్స్, మార్వాడీలు మాకొద్దు మా ఊరు షాపులే మాకు ముద్దు' అనే నినాదంతో వనపర్తి జిల్లాలో అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాల్స్, మార్వాడీ వ్యాపారాలపై వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నామని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మాల్స్, మార్వాడీ షాపులలో కొనుగోళ్లు మానుకుని, స్థానిక వ్యాపారులు, చిన్న షాపులను ఆదరించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. ఈనెల 14న వనపర్తిలో జరగనున్న సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ సమక్షంలో ఉద్యమాన్ని అధికారికంగా ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టీడీపీ కొత్తగొల్ల శంకర్, సామాజిక కార్యకర్త గొనికాడి యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బొడ్డుపల్లి సతీష్, ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు రామస్వామి, నాగరాజు, రమేష్, జింగిడిపురం రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జీపీల పెండింగ్ బిల్లులు అందేనా?



శాగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

- సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి రెండేళ్లయినా అందని బిల్లులు
- పెరుగుతున్న అప్పులు, వడ్డీలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న మాజీ సర్పంచ్‌లు

మండలాల వారీగా జీపీల పెండింగ్ బిల్లుల వివరాలు

మండలం	జీపీలు	పెండింగ్ బిల్లులు
పాన్‌గల్	28	రూ.1.56 కోట్లు
చిన్నంబావి	17	రూ.70 లక్షలు
వీపనగండ్ల	14	రూ.కోటి వరకు

పాన్‌గల్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు అందకపోవడంతో మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. పదవీకాలం ముగిసి రెండేళ్లైనా నేటికీ బిల్లులు విడుదల కాకపోవడంతో అప్పులు పెరిగి వడ్డీలు చెల్లించలేక మాజీ సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేస్తుందని ఆశ పడినా, నిరాశే మిగిలింది. మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో చిన్న జీపీలకు రూ.5 లక్షలు, పెద్ద జీపీలకు రూ.10లక్షలు, రూ.20 లక్షలకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో డ్రెయినేజీలు, జీపీ భవనాలు, సీసీ రోడ్లు, ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. ఆయా అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు విడుదల చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా బిల్లులు మాత్రం విడుదల కావడంలేదు.


పెండింగ్ బిల్లుల కోసం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌లు(ఫైల్)

వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామ పంచాయతీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు దాదాపుగా రూ.28 లక్షల బిల్లులు రావాలి. అప్పులు చేసి వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామ అభివృద్ధిలో భాగంగా చేసిన పనులకు సంబంధించిన బిల్లులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేసి ఇబ్బందులు తొలగించాలి.

– మౌనిక, మాజీ సర్పంచ్, శాగాపూర్

రూ.30 లక్షలకుపైగా బిల్లులు రావాలి



మండల కేంద్రం పాన్‌గల్ గ్రామ పంచాయతీలో చేపట్టి న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి దాదాపుగా రూ.30 లక్షలకు పైగా పెండింగ్ బిల్లు లు రావాల్సి ఉంది. వీటి కోసం పదవీలో ఉన్నప్పటి నుంచి పదవీ కాలం పూర్తైన తర్వాత కూడా ఎదురు చూపులు తప్పడం లేదు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టాం. వాటికి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి జీపీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి.

– గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్, పాన్‌గల్

ప్రభుత్వానికి నివేదించాం



మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. మండలంలో దాదాపుగా రూ.కోటికి పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. వాటికి సంబంధించిన పెండింగ్ బిల్లు లు విడుదలైతే మాజీ సర్పంచ్‌లకు తెలియజేస్తాం.

– గోవింద్‌రావు, ఎంపీడీఓ, పాన్‌గల్

ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు



కొత్తకోట: పోరాట ఫలితంగా నిర్మాణ రంగ కార్మికులకు ప్రమాద బీమా రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు, సహజ మరణానికి లక్ష నుంచి రూ.2 లక్షలకు ప్రభుత్వం జీఓ నంబర్ 12ను జారీ చేసిందని బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ అన్నారు. మంగళవారం పాలెం గ్రామంలో భవన నిర్మాణ తాపీ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గత ప్రభుత్వంలో బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ కార్మికులు ఎన్నో సార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ రంగ కార్మికులకు పరిహారం పెంచడంతో హర్షం వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు గాయపడిన, పనిచేయలేని పరిస్థితి ఏర్పడితే బిల్డింగ్ కార్మికుడికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ ద్వారా నష్ట పరిహారం అందిస్తారన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో భద్రాచలంలో తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ కార్మికుల ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాలెం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు నాగన్న, కార్యదర్శి వెంకటయ్య, కోశాధికారి కురుమన్న, శ్రీరాములు, బాలస్వామి, మన్యం, కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం క్షయ వ్యాధి నిర్ధారణపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి రెండు వారాలకు మించి ఎడతెగని దగ్గు, జ్వరం, తెమడలో రక్త పడటం, బరువు తగ్గడం, ఛాతి ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తే తెమడ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి సోకిన వారు వైద్యులు సూచించిన విధంగా క్రమం తప్పకుండా 6 నెలలు మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. వ్యాధి సోకిన వారికి నిక్షయ్ పోషన్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకాహారం తీసుకునేందుకు నెలకు రూ.1000 అందిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు

అమరచింత: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు ముగిసినట్లు మండల విద్యాధికారి భాస్కర్ సింగ్ తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో పోటీలలో గెలుపొందిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్‌ఐ డైరెక్టర్ కుమార్, సంతోష, మధు, రవికిరణ్ గౌడ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళనకు గురికావొద్దు


గోపాల్‌పేట పీఏసీఎస్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

గోపాల్‌పేట: రైతులు అపోహలకు గురి కావాల్సిన అవసరం లేదని, యూరియా సరిపోయినంత ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం ఆయన గోపాల్‌పేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, శ్రీసాయి ఫర్టిలైజర్స్ సీడ్స్ గోదాంను ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం యూరియా నిల్వలను పరిశీలించారు. పీఏసీఎస్ చైర్మన్లు సకాలంలో యూరియా కోసం డీడీలు కట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడారు. యూరియా పంపిణీ నిరంతర ప్రక్రియ అని, రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ప్రస్తుతం పీఏసీఎస్‌లో 54 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, అందరికీ అందుతుందన్నారు. రైతులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో నాలుగు స్టాక్‌పాయింట్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తున్నామన్నారు.

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ

మండల కేంద్రంలో ఉన్న బీసీ బాలికల హాస్టల్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. సమస్యలపై వార్డెన్ జీవితను అడిగారు. మౌలిక సదుపాయాలు ప్రహరీ వంటి పనులు చేపట్టేందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థుల భోజనంలో రాజీపడకుండా నాణ్యతగా అందించాలన్నారు. ఎంపీడీఓ భవాని, తహసీల్దార్ పాండునాయక్, ఏఓ కరుణశ్రీ వారి వెంట ఉన్నారు.

క్రీడల్లో విద్యార్థుల అద్భుత ప్రతిభ


దుప్పల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

మదనాపురం: మదనాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలలో జెడ్పీహెచ్‌ఎస్ దుప్పల్లి విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపించి పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్–14 కబడ్డీ (బాయ్స్) విభాగంలో ప్రథమ బహుమతి అందుకున్నారు. అండర్–14 వాలీబాల్ (గర్ల్స్) విభాగంలో మొదటి బహుమతి సాధించారు. అండర్–14 వాలీబాల్ (బాయ్స్), అండర్–14 ఖోఖో (బాయ్స్, గర్ల్స్) విభాగాల్లో రెండో బహుమతి అందుకున్నారు. అండర్–17 కబడ్డీ (బాయ్స్), ఖోఖో(బాయ్స్, గర్ల్స్) విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూలే ఆంజనేయులు క్రీడా బృందానికి మార్గదర్శకత్వం వహించిన ఫిజికల్ డైరెక్టర్ జి.ఈశ్వరమ్మను ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ. రాజు, నాగేష్, కృష్ణవేణి, ఇషాక్ పాషా, పాండురంగ, శ్రీనివాసులు, రామకృష్ణ విద్యార్థులను అభినందించారు.

గురుకులంలో సమస్యలు పరిష్కరించాలి


గురుకుల పాఠశాల వద్ద మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలను మంగళవారం ఆయా పార్టీల నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మాట్లాడుతూ పాఠశాలలో అన్ని సమస్యలే ఉన్నాయన్నారు. బాత్‌రూంలకు తలుపులు కిటికీలు లేవన్నారు. డ్రెయినేజీ సరిగా లేక విద్యార్థులు మురుగు వాసన తట్టుకోలేకపోతున్నారన్నారు. వాటర్ లీకేజీలతో బిల్డింగ్‌కు సైతం పాకర పట్టిందని ప్రిన్సిపాల్ ఆరోగ్యంను నిలదీశారు. కలెక్టర్ వెంటనే స్పందించి ప్రన్సిపాల్ ఆరోగ్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు వారం పదిరోజుల్లో పరిష్కారం కాకుంటే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కదిరె మధు, శివ, అరవింద్‌రెడ్డి, సురేష్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షుడు రాజేష్, కాంగ్రెస్ నాయకులు సత్యశీలారెడ్డి, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు కొంకి వెంకటేష్, జిల్లా ఆర్టీఐ చైర్మన్ కొంకి రమేష్, యాదగిరి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘనీ

వనపర్తి రూరల్: వనపర్తి మండలంలో 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డుకు ఎంపిక చేశామని ఎంఈఓ మద్దిలేటి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ ఘనీ మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి డీఈఓ, ఎంఈఓ, జీహెచ్‌ఎంలు ప్రశంసాపత్రం అందజేశారు.

వనపర్తి విద్యావిభాగం: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా వనపర్తి టీఎన్‌జీఓ భవనంలో అభినందన సన్మాన సభ నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. రవిప్రసాద్ గౌడ్, డి.కృష్ణయ్య, రిటైర్డ్ మండల విద్యాధికారి కే.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కే.శేఖర్, పాన్‌గల్ ఎంఈఓ, బి.శ్రీనివాసులు, శ్రీరంగాపూర్ ఎంఈఓ టి.హనుమంతు ఉన్నారు.

తెలంగాణ వైతాళికుడు కాళోజీ


కొత్తకోటలో కాళోజీ జయంతిలో పాల్గొన్న ఐక్యవేదిక కుల సంఘాల నాయకులు


చిట్యాల పాఠశాలలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వనపర్తి టౌన్: కాళోజీ నారాయణ రావు జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో గౌరవకారణమని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు, విద్యుత్ ఎస్‌ఏ రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా డిగ్రీ కళాశాలలో కాళోజీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఎస్‌ఏఓ వెంకటరమణ, ఏఈ రాజయ్యగౌడ్, బాలప్రతాప్, పుల్యా, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, ఇంజినీర్ ప్రశాంత్, అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో కాళోజీ 111వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్ ప్రకాశ్‌కవులు గిరిరాజాచారి, నాయకంటి నరసింహాశర్మ, ప్రజా, కులసంఘాల నాయకులు ఉన్నారు.

వనపర్తి రూరల్: కాళోజీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో, పెబ్బేరు మండలంలోని మోడల్ పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు.

కొత్తకోట: కొత్తకోట పట్టణ తెలంగాణ చౌరస్తాలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ గొనికాడి రాములు యాదవ్ సమక్షంలో కాళోజీ నారాయణరావు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటన్న గౌడ్, కృష్ణయ్య గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కురుమూర్తి, నజీర్, జహంగీర్ పాల్గొన్నారు.


అమరచింతలో..

అమరచింత: మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ నాగరాజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలల్లో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పద్యధారణ, భాషా క్విజ్, కథల పోటీలు నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడారు.

ఆత్మకూర్: ఆత్మకూర్‌లో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర్, హెచ్‌ఎం లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

అమరచింత: ఆర్టీసీ బస్సు, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన టాటా సుమో ఢీకొన్న సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు, సుమోలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. మండలంలోని పాంరెడ్డిపల్లె గ్రామ శివారులో ఆత్మకూర్ నుంచి మరికల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్ కొంకన్వానిపల్లె నుంచి అమరచింతకు వస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ టాటాసుమోను ఢీ కొట్టింది. బస్సులో ప్రయాణికులతో పాటు సుమోలో ఉన్న వైద్య సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. కొంకన్వానిపల్లెలో ప్రజలకు డ్రైడే సందర్భంగా వైద్య సేవలు, ఆరోగ్య సలహాలు ఇచ్చేందుకు వెళ్లినట్లు హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ తెలిపారు.

కొనసాగుతున్న 100 రోజుల ప్రణాళిక



వనపర్తిటౌన్: వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కొనసాగుతోంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని 02,05,15,23, 25,29వ, వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా తడి, పొడి వ్యర్థాల విభజన, సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియాపై అవగాహన, వీధి, పెంపుడు కుక్కలపై ఏబీసీ ప్రచారం, డీ2డీ వ్యర్థాల సేకరణ, నివాసం నుంచి వాణిజ్యకు వాణిజ్య లైసెన్స్ మార్పిడి, మురుగు కాలువల్లో డెస్టిల్ తొలగించే పనులను కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

43 కుక్కలు పట్టివేత

ఆత్మకూర్: ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో ఒకేరోజు 43 వీధి కుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించామని కమిషనర్ చికినే శశిధర్ తెలిపారు. వీధి కుక్కల నుంచి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జనన నియంత్రణ వ్యాక్సిన్‌వేసి వదిలిపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డుల అధికారులు,సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

ఆత్మకూర్: ఆత్మకూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. మంగళవారం షటిల్, క్రికెట్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. పోటీలతో కార్మికులకు ఉద్యోగులకు శారీరకంగా ఎంతో ఉపయోగాలు ఉంటాయని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు.

లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి



వనపర్తిటౌన్: ఈనెల 13న, జాతీయ లోక్ అదాలత్ ఉండబోతుందని, కక్షిదారులు లోక్‌అదాలత్ ద్వారా కేసులను త్వరగతిన పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. మంగళవారం జిల్లా ప్రధాన న్యాయస్థానంలో జిల్లా న్యాయమూర్తులతో జరిగిన సమావేశం ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీపడే క్రిమినల్ కేసులు, భాగ పరిష్కార సివిల్ కేసులు, డ్రంకెన్ డ్రై వ్ కేసులు, ట్రాఫిక్ చలాన్ కేసులు, ఎక్సైజ్ కేసులు, వైవాహిక, కుటుంబ కలహాలు, ప్రసార, టెలికాం కేసులు, చెక్‌బోన్స్ వివాదాలు, అద్దె, ఆస్తి వివాదాలు, ఇతర కేసులను అధిక మొత్తంలో రాజీతో పరిష్కరించాలని సూచించారు. మధ్యవర్తిత్వంలో భాగంగా ఇరువర్గాలను పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి కక్షిదారుల అంగీకారంతో కేసులను రాజీ పరచాలన్నారు. అన్ని కోర్టుల న్యాయమూర్తులు సంబంధిత అధికారులతో చర్చించి లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులను రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, రజని, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కళార్చన, అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి కవిత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి కార్తీక్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీలత పాల్గొన్నారు.

ఎన్నికల హామీగానే డిగ్రీ కళాశాల

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు విషయం నాయకులకు ఎన్నికల హామీగా మారిందని మండల బీజేవైఎం అధ్యక్షుడు గోపి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సాయినాథ్, జిల్లా దళితమోర్చా ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. స్థానిక సమస్యలపై మంగళవారం వారు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఖిల్లాఘనపురం మండల కేంద్రం వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ మూడు జిల్లా కేంద్రాలకు మధ్యలో ఉందన్నారు. ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల మూడు జిల్లాలకు చెందిన పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. మండలంలోని సమస్యలపై నాయకులు ప్రతిసారి హామీలు ఇవ్వడం తరువాత మరవడం జరుగుతుందన్నారు.

ఇసుక తరలింపు అడ్డుకున్న గ్రామస్తులు

మదనాపురం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మంగళవారం అజ్జకొల్లు గ్రామస్తులు అడ్డుకున్నారు. భూగర్భ జలమట్టం క్షీణించి భవిష్యత్‌లో సాగునీటి కొరత తలెత్తే అవకాశముందని మండిపడ్డారు. ఇసుక తరలింపు తక్షణమే నిలిపేయాలని అక్రమ తవ్వకాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

యూరియా కోసం తప్పని నిరీక్షణ

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లోని సింగిల్ విండో, ఫర్టిలైజర్ దుకాణాల ముందు యూరియా కోసం రైతుల బారులు తీరుతున్నారు. మంగళవారం పాన్‌గల్ మండలంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఓ డాకేశ్వర్ గౌడ్ పర్యవేక్షణలో పంపిణీ చేశారు. కార్యాలయంలో నాలుగు రోజుల క్రితం ఇచ్చిన 806 టోకెన్లలో 100 మంది రైతులకు, ధరణి ఫర్టిలైజర్ దుకాణంలో 168 మంది రైతులకు యూరియా పంపిణీ చేశారు.

- మదనాపురం మండల కేంద్రంలో ఉదయాన్నే మొదలైన క్యూ, మధ్యాహ్నం దాటే వరకూ సాగింది. వృద్ధులు, యువకులు, మహిళా రైతులు అందరూ ఓర్పుగా నిలబడ్డారు. స్థానిక పోలీస్ శాఖ, వ్యవసాయశాఖ అధికారులు రంగంలోకి దిగి తోపులాట, గందరగోళం జరగకుండా నివారించారు.
- ఖిల్లాఘనపురం మండలంలో ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రైవేట్, సింగల్‌విండో కార్యాలయం దగ్గర క్యూలైన్‌లో నిలబడుతున్నారు. ఖిల్లాఘనపురం రైతువేదిక దగ్గర టోకెన్ల కోసం క్యూ కట్టారు. 9వ తేదీ టోకన్లు ఉన్న వారు ప్రైవేట్, సింగల్‌విండో కార్యాలయం దగ్గర నిలబడి ఆధార్ కార్డు ప్రకారం రెండు బస్తాల యూరియా తీసుకెళ్లారు.
- ఆత్మకూర్ మండలంలోని ఆయా గ్రామాల రైతులు ఉదయం నుంచి యూరియా కోసం చెప్పులను, పాస్‌పుస్తకాలను వరుసక్రమంలో పెట్టి పడిగాపులు కాశారు. మధ్యాహ్నం 300 బ్యాగుల యూరియా రావడంతో ఒక్కసారిగా రైతులు తోపులాట జరిగింది. రైతులకు వ్యవసాయశాఖ అధికారులకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రోశయ్య ఆధ్వర్యంలో 148 మంది రైతులకు 300 బస్తాల యూరియా పంపిణీ చేశారు. 165 మంది రైతులకు టోకెన్లు ఇచ్చి బుధవారం యూరియా అందిస్తామని ఏఓ వినయ్‌కుమార్, సీఈఓ నరేష్ తెలిపారు.


పాన్‌గల్ సింగిల్ విండో కార్యాలయం ఎదుట ఎస్‌ఐ పర్యవేక్షణలో యూరియా పంపిణీ